క్లుప్తంగా

దైవ చింతనతో మానసిక ప్రశాంతత

పటాన్‌చెరు టౌన్: దైవ చింతనతో మానసిక ప్రశాంత లభిస్తుందని పటాన్‌చెరు మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని ఇస్నాపూర్ జగన్నాథస్వామి ఆలయంలో సోమవారం జగన్నాథ రథయాత్ర ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన పూజ కార్యక్రమంలో శ్రీకాంత్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు శ్రీకాంత్‌గౌడ్ ఘనంగా సన్మానించారు. ఆయన వెంట ఎస్‌ఆర్‌కే యువసేన సభ్యులు ధనరాజ్,నరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

నెహ్రూనగర్‌లో వైద్య శిబిరం

నారాయణఖేడ్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని నెహ్రూనగర్‌లో సోమవారం హెల్త్ క్యాంపు ఏర్పాటు చేశారు. క్యాంపును ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, కమిషనర్ జగ్జీవన్ మాట్లాడుతూ వానాకాలంలో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అందువల్ల ప్రతిఒక్కరూ అప్రమత్తతతో ఉండాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనారోగ్య సమస్యలు వచ్చినా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. శిబిరంలో వైద్యులు సుశీల్‌కుమార్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీలో జాప్యం తగదు

జహీరాబాద్: కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కుల పంపిణీ విషయంలో ప్రభుత్వం ఉదాసీన వైఖరిని అవలంబిస్తోందని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నరోత్తం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు చెందిన ఆడబిడ్డ పెళ్లికి రూ.లక్ష అందజేసిందన్నారు. కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి ఎన్నికల ముందు రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ప్రభుత్వం వచ్చి 8 నెలలు అవుతున్నా ఇప్పటివరకు రాష్ట్రంలో ఎక్కడా ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలో సుమారు 600మంది లబ్ధిదారులకు ఈ పథకం ద్వారా మంజూరు లభించిందన్నారు. అయినా చెక్కులు ఇచ్చే విషయంలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. ప్రభుత్వం స్పందించి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను అందజేయాలని డిమాండ్ చేశారు.

టీజీ ఐఐసీ చైర్‌పర్సన్‌కు సన్మానం

జిన్నారం(పటాన్‌చెరు): టీజీ ఐఐసీ చైర్‌పర్సన్‌గా నియమితులైన నిర్మలను ఐఎన్‌టీయూసీ నాయకులు నర్సింహ్మారెడ్డి, బొల్లారం మున్సిపల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశ్రామిక వాడలను అభివృద్ధి చేయాలని కోరారు. నాయకులు శ్రీహరి, శివానంద్, దేవానంద్, నరేందర్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

హత్నూర(సంగారెడ్డి): మండల కేంద్రంలోని కేజీబీవీ బాలికల ఆశ్రమ పాఠశాలలో సోమవారం బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జయలక్ష్మి మాట్లాడుతూ పాఠశాలలో ఈ నెల 11నుంచి 20తేదీ వరకు హర్ వాయిస్ ప్రోగ్రాంలో భాగంగా బాలికల హక్కులు, తదితర చట్టాలపై అవగాహన సదస్సు కొనసాగుతోందని పేర్కొన్నారు. కౌమార దశ ఉన్న బాలబాలికలు తమ భవిష్యత్తు గురించి ఆలోచించడానికి బాల్య వివాహాలకు వ్యతిరేకంగా అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. బాలికలకు, మహిళలకు హక్కులు, చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన ఉండేందుకు ఈ క్యాంపు నిర్వహిస్తోందని తెలిపారు.

ఘన వ్యర్థాల పారబోత

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని ఖాజీపల్లి పారిశ్రామికవాడలోని కుంటలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు వ్యర్థ ఘన పదార్థాలను పారబోశారు. వారం రోజుల నుంచి గుట్టుచప్పుడు కాకుండా వ్యర్థాలను పారబోస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు. పీసీబీ, ఇరిగేషన్ శాఖల అధికారులు స్పందించి వ్యర్థాలను పారబోస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విరాళం అందజేత

మునిపల్లి(అందోల్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు పీఎస్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ రూ.25వేల చెక్కును మక్తక్యాసారం గ్రామానికి చెందిన అంబేడ్కర్ సంఘం నాయకులకు మాజీ జెడ్పీటీసీ మీనాక్షి క్యాంపు కార్యాలయంలో సోమవారం అందజేశారు. కార్యక్రమంలో మక్తక్యాసారం మాజీ సర్పంచ్ విఠల్, బక్కయ్య, మల్లేశం, కిష్టయ్య, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ఆటో బోల్తా

మునిపల్లి(అందోల్): ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిన్నచల్మెడ గ్రామానికి చెందిన పలువురు చావు శుద్ధికి పోయి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో మన్‌సాన్‌పల్లి చౌరస్తా రాగానే సమీపంలో ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా ముగ్గురు మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

అసంపూర్తి రోడ్లకు
మోక్షం ఎప్పుడో?

- నత్తనడకన గుమ్మడిదల-కానుకుంట గ్రామాల రహదారి పనులు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు



అసంపూర్తిగా గుమ్మడిదల-కానుకుంట రహదారి

జిన్నారం(పటాన్‌చెరు): ఏడాదిన్నర క్రితం చేపట్టిన గుమ్మడిదల-కానుకుంట రహదారి పనులు నేటివరకూ పూర్తి కాలేదు. దీంతో వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. పనులు పూర్తి చేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. గుమ్మడిదల నుంచి అనంతారం గ్రామం మీదుగా కానుకుంట వరకు డబుల్ రోడ్డును వేయించేందుకు ఏడాదిన్నర క్రితం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. రూ.1.50 కోట్ల నిధులు మంజూరు కాగా మరో రూ.7.50 కోట్ల సీఎస్‌ఆర్ నిధులు కేటాయించి డబుల్ రోడ్డు వేయించేందుకు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ఈ రోడ్డు పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. ఇరువైపులా రోడ్డు వేయించేందుకు గుంతలు తీసి మట్టి పోసి వదిలేశారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ రోడ్డుపై ఎక్కువగా మూల మలుపులు ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్టీసీ బస్సులు కూడా రాకపోతుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు ఈ రోడ్డు విషయమై అధికారులను నిలదీశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయించేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పనుల పూర్తికి చర్యలు

గుమ్మడిదల-కానుకుంట రోడ్డు పనులను పూర్తి చేయించడంలో కొంత జాప్యం జరుగుతోంది. వాహదారులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయించేవిధంగా చర్యలు చేపడుతున్నాం.

– రామరాజు, ఆర్‌అండ్‌బీ ఏఈ

కంకర వేశారు.. వదిలేశారు

- అసంపూర్తిగా రోడ్డు పనులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న గిరిజనులు



కంకర వేసి వదిలేయడంతో అసంపూర్తిగా ఉన్నా బల్కంచెల్క తండా రోడ్డు

తరుచూ ప్రమాదాలు..

కల్హేర్(నారాయణఖేడ్): బీటీ రెన్యూవల్ పనుల కోసం ఉన్న రోడ్డును తవ్వి కంకర వేసి అసంపూర్తిగా పనులు వదిలేశారు. దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడంలేదు. నిజాంపేట మండల పరిధిలోని బల్కంచెల్క తండాకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో చందర్‌నాయక్ తండా, బల్కంచెల్క తండావాసులు సంగారెడ్డి, నారాయణఖేడ్, పెద్దశంకరంపేట, నిజాంపేట, బాచేపల్లి, తదితర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బల్కంచెల్క తండా బీటీ రోడ్డును అసంపూర్తిగా వదిలేయడంతో తరుచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల జరిగిన ప్రమాదంలో తండాకు చెందిన మూడ్ రాంచందర్, తదితరులు ద్విచక్రవాహనాలు అదుపు తప్పడంతో కింద పడి తీవ్రంగా గాయపడ్డారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు



బల్కంచెల్క తండాకు రోడ్డు పనులు పూర్తి చేయకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్డు పూర్తిగా కంకర తేలి గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు కంకర్‌పై అదుపు తప్పి పడిపోతున్నారు. అయినా ఎవరూ పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలి.

– మన్మోహన్‌సింగ్, బల్కంచెల్క తండా

మా భూములను మాకివ్వాలి

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలోని సర్వేనెంబర్ 1లోని రైతుల భూములను గత ప్రభుత్వం హెచ్‌ఎండీఏ, టీజీ ఐఐసీలకు కేటాయించింది. కానీ... రైతులకు ఇవ్వాల్సిన పరిహారం మాత్రం ఇవ్వలేదు. దీంతో రైతులు తమ భూములను తమకు కేటాయించాలని కోరుతూ తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తాము సాగు చేసుకుంటున్న భూములను గత ప్రభుత్వం బలవంతంగా లాక్కొని హెచ్‌ఎండీఏ, టీజీ ఐఐసీలకు అప్పజెప్పిందన్నారు. ఎకరాలకు 600 గజాల చొప్పున స్థలాన్ని ఇస్తామని చెప్పి మోసం చేసిందని వాపోయారు. తాము సాగు చేసుకుంటున్న భూములను తమకే అప్పజెప్పాలని కోరుతూ కోర్టును కూడా ఆశ్రయించామన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న రైతులు, నాయకులు

అయినా కొన్ని పరిశ్రమల యాజమాన్యాలు సంబంధిత భూముల్లో నిర్మాణాలను చేపడుతున్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి తాము సాగు చేసుకుంటున్న భూములను తమకు కేటాయించేవిధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.రైతులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత

పటాన్‌చెరు: మండల పరిధిలోని ముత్తంగి ప్రభుత్వ పాఠశాలలో పార్కర్ హనీ ఫిన్ ఇండియా వారి సహకారంతో మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు విద్యార్థులకు సోమవారం ఎడ్యుకేషన్ కిడ్స్, ఆట వస్తువులను అందజేశారు. అనంతరం మెడ్వాన్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లలకు సాంకేతిక విజ్ఞానం అవసరం

సంగారెడ్డి : జన్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైన్స్ అండ్ మ్యాథమెటిక్స్ వర్క్‌షాప్‌ను సోమవారం జిల్లా సైన్స్ కార్యాలయంలో డీఈఓ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై విచారణ

సాక్షి ఎఫెక్ట్

హత్నూర(సంగారెడ్డి): మా గోడు పట్టించుకోండి.. అంటూ సాక్షి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన కథనానికి స్పందించిన జిల్లా బీసీ సంక్షేమ సహాయ అధికారిని భాగ్యలక్ష్మి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల కేంద్రంలోని బీసీ సంక్షేమ వసతి గృహంలోని విద్యార్థులు, వార్డెన్ సిబ్బందితో వేరువేరుగా మాట్లాడినట్లు తెలిపారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదికను జిల్లా అధికారికి అందజేస్తానని పేర్కొన్నారు. నివేదిక ఆధారంగా బాధ్యులైన వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మెనూ ప్రకారం.. విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనం అందించాలని సిబ్బందిని ఆదేశించారు.



హాస్టల్ సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా బీసీ సంక్షేమ సహాయ అధికారిని భాగ్యలక్ష్మి

పాపిస్త్రా ఫౌడర్ స్వాధీనం

మునిపల్లి(అందోల్): నిషేధిత పాపిస్త్రా ఫౌడర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్ఫోర్స్‌మెంట్ సీఐ గాంధీనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. కంకోల్ టోల్ ప్లాజా సమీపంలో సోమవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో రాజస్థాన్ నుంచి వస్తున్న బస్సులో అనుమానస్పదంగా ఉన్న వ్యక్తిని తనిఖీ చేయగా అతని వద్ద హెరాయిన్ తయారీలో ఉపయోగించే 260 గ్రాముల పాపిస్త్రా ముడి పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు రాజస్థాన్‌కు చెందిన జాలూర్ మండలం కడవు గ్రామానికి చెందిన డోగ్రిగా గుర్తించారు. ముడిపదార్థాన్ని కేజీ రూ.50వేల చొప్పున తీసుకువచ్చి ఇక్కడి లారీడ్రైవర్లకు 50 గ్రాములకు రూ.3000 చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు. తనిఖీలలో ఎస్ఐ యాదయ్య, హెడ్ కానిస్టేబుల్ అలీమ్, కానిస్టేబుల్ కరీం, వినయ్, వివేక్, ఉమా తదితరులు పాల్గొన్నారు.

27 అంశాలకు కౌన్సిల్ ఆమోదం

జోగిపేట(అందోల్): అందోల్ జోగిపేట మున్సిపాలిటీలోని అభివృద్ధి పనులు చేపట్టేందుకు పాలకవర్గం రూ.2.95కోట్ల నిధులకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ మల్లయ్య అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో చేపట్టబోయే అభివృద్ధి పనులకు సంబంధించి 27 ఎజెండా అంశాలతో కూడిన నివేదికను సభ్యులకు చదివి వినిపించారు. మున్సిపల్ దుకాణ సముదాయాలకు టెండర్లు నిర్వహించాలని, అనుమతులు లేకుండా నిర్మించిన ఫంక్షన్ హాల్స్ పైన ఉన్న పెనాలిటీలను వసూళ్లు చేయాలని నిర్ణయించారు. జాతీయ రహదారిపై ఉన్న డివైడర్ సెంట్రల్ లైటింగ్ మరమ్మతులు చేపట్టాలని, వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణం, గడ్డిమందు, దోమల మందు పిచికారీ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని సభ్యులు అధికారులకు సూచించారు. వార్డుల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలని తీర్మానించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ తిరుపతి, వైస్‌చైర్మన్ ప్రవీణ్, కౌన్సిలర్లు చిట్టిబాబు, సురేందర్‌గౌడ్, శంకర్, హరికష్ణగౌడ్, చందర్, దుర్గేష్, రేఖా ప్రవీణ్, మాధవి వెంకటేశం, భారతి, నాగరాజు, ధనలక్ష్మి, భవానీ నాగరత్నం గౌడ్, కోఆప్షన్ సభ్యుడు ఫైజల్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ వినయ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ మల్లయ్య

కార్పొరేట్ తరహాలో వైద్యం అందిస్తాం

ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: పేదలకు కార్పొరేట్ తరహాలో రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 138 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ పథకం ద్వారా మంజూరైన చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం అవలంబించిన విధానాలతో ఆరోగ్యశ్రీ పథకం అస్తవ్యస్తం అయ్యిందన్నారు. ఆరోగ్య శ్రీ పథకం ద్వారా చికిత్సలు చేసిన ఆస్పత్రులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో ఆస్పత్రులు సరియైన చికిత్సలు అందించక పేదలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం రేవంత్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని అర్హులైనవారికి అందించేందుకు వైద్యం కోసం రూ.5 లక్ష నుంచి రూ.10 లక్షలకు పెంచి పేద కుటుంబాల్లో ధైర్యం నింపారని వివరించారు. కార్యక్రమంలో బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వినోద్ పాటిల్, మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్ మాజీద్, మాజీ ఎంపీటీసీలు పండరిరెడ్డి, దత్తు, ముంతాజ్, శంకర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం

జహీరాబాద్ టౌన్: మండల పరిధిలోని చిరాగ్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులు భవానీ, ఇందిరను గ్రామస్తులు, విద్యార్థులు సోమవారం ఘనంగా సన్మానించారు. అదేవిధంగా బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు అనిత, వెంకటలక్ష్మిని కూడా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం స్వర్ణకుమారి, జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌ఎం రేణుకాదేవి, ఉపాధ్యాయులు శాంతివీర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆత్మీయ వీడ్కోలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని వెంకటాపూర్ ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులుగా సేవలందించిన నర్సింలు, ప్రసన్న బదిలీపై వెళుతున్న నేపథ్యంలో వారిని సోమవారం ప్రధానోపాధ్యాయులు జయంతి, సురేష్ తోటి ఉపాధ్యాయులతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు ప్రసన్న విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేయగా ప్రధానోపాధ్యాయులు జయంతి నోట్ బుక్స్, పెన్నులు అందజేశారు. అదేవిధంగా పాఠశాలకు నూతనంగా విచ్చేసిన ఉపాధ్యాయులకు ఘనంగా స్వాగతం పలికారు. మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



టీచర్లకు నిర్వహిస్తున్న సన్మానం

చిన్నారుల భవిష్యత్‌కు పునాదులు వేయాలి

నారాయణఖేడ్: ఆరేళ్ల లోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి వారి భవిష్యత్తుకు పునాదులు వేయాలని అంగన్‌వాడీ టీచర్లు నాగేశ్వరి, అనురాధ, యశోధ, స్వరూప, వాసంతి అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం బడిబాటలో భాగంగా అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, గ్రామస్తులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

నిజాంపూర్ గ్రామంలో...

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులను చేర్పించాలని కోరుతూ మండల పరిధిలోని నిజాంపూర్ గ్రామంలో అమ్మ మాట-అంగన్వాడీ బాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ నర్సమ్మ, డ్వాక్రా సంఘం ప్రతినిధులు, ఉపాధ్యాయులు, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి

నారాయణఖేడ్: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి నల్లవల్లి రమేష్, అంగన్‌వాడీ టీచర్ల యూనియన్ నాయకులు నాగేశ్వరి, అనురాధ విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఖేడ్ పట్టణంలో సోమవారం నిరసన చేపట్టారు. అనంతరం ఎంపీ సురేష్‌షెట్కార్‌కు ఆయన నివాస గృహంలో కలిసి సన్మానించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించాలని, గ్యాస్, కూరగాయలు, భవనం అద్దెలు, బిల్లులు త్వరగా అందేవిధంగా చూడాలని కోరారు. దీంతో స్పందించిన ఎంపీ మాట్లాడుతూ అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. నాయకులు వీణ, సుశీలమ్మ, భారతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని ఎంపీకి వినతి

జహీరాబాద్ టౌన్: ఎల్ఐసీ ఏజెంట్ల యూనియన్ కార్యాలయం కోసం స్థలం కేటాయించాలని కోరుతూ యూనియన్ ఫెడరేషన్ నాయకులు ఎంపీ సురేష్ షెట్కార్‌ను కోరారు. పట్టణంలోని బసవేశ్వర భవనంలో ఆదివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీని ఎల్ఐసీ ఏజెంట్లు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్ఐసీ ఏజెంట్ ఫెడరేషన్ జహీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు సుభాష్ మాట్లాడుతూ జహీరాబాద్, నారాయణఖేడ్ నియోజకవర్గం కలిపి 364 మంది ఎల్ఐసీ ఏజెంట్లు పనిచేస్తున్నారన్నారు. సమావేశాలు నిర్వహించడానికి సొంత కార్యాలయం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. దీంతో స్పందించిన ఎంపీ సురేష్ షెట్కార్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యదర్శులు ప్రభు, యూనియన్ నాయకులు శంకర్, మాధవరావు, సంగారెడ్డి, మాణిక్ ప్రభు, మోహన్‌రెడ్డి, భూంరెడ్డి, విఠల్‌గౌడ్, వెంకటేశం, దుర్గయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **మైత్రి క్రికెట్ క్లబ్ కమిటీ ఎన్నిక**

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలోని మైత్రి క్రికెట్ క్లబ్ కార్య నిర్వాహక కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షుడిగా 6వ సారి ఏకగ్రీవంగా హనుమంతరెడ్డిని ఎన్నుకున్నారు. జనరల్ సెక్రెటరీగా రవీందర్‌గిరిని, ఉపాధ్యక్షుడిగా రాజు, జాయింట్ సెక్రటరీగా ఇషాక్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా సుమన్, కోశాధికారిగా శ్రీనివాస్ ఎన్నుకున్నారు.

◆ **బదిలీల ప్రక్రియ వేగవంతం చేయాలి**

సంగారెడ్డి టౌన్: జిల్లాలో ఉద్యోగుల బదిలీల ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ క్రాంతి అన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో 80 ప్రకారం జిల్లా స్థాయి బదిలీలు చేపట్టాలన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయా పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో సర్వీసులు పూర్తిచేసిన జిల్లాస్థాయి సిబ్బంది వివరాలు ప్రభుత్వాదేశాలకు అనుగుణంగా సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి అఖిలేష్ పాల్గొన్నారు.

◆ **శివాలయ నిర్మాణానికి విరాళం**

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలో నిర్మిస్తున్న శివాలయానికి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. ఊట్ల గ్రామానికి చెందిన మంజులవాణి నందకుమార్ సోమవారం రూ.2.51లక్షలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు నందకుమార్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు చెప్పారు.

◆ **భెల్ సందర్శన**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ పరిశ్రమను సోమవారం షెడ్యూల్డ్ తెగల జాతీయ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు భెల్ ఈడీ కేపీ రాజా, జీఎం హెచ్‌ఆర్ శ్రీనివాస్‌రావు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు నివాళులర్పించారు. బెల్ యాజమాన్యంతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

◆ **నోట్‌బుక్కులు పంపిణీ**

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట మండలం బల్కంచెల్క తండాలో విద్యార్థులకు నోట్ బుక్కులు పంపిణీ చేశారు. తండాలో మెడ్చల్ జిల్లా రవాణా అధికారి మూడ్ కిషన్‌సింగ్ జన్మదినం వేడుకలు నిర్వహించారు. అనంతరం భవానీమాత మందిరం అవరణలో మొక్కలు నాటారు. మాజీ జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రవీందర్‌నాయక్, మాజీ సర్పంచ్ జగన్‌చారీ, తదితరులు కిషన్‌సింగ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తండా ప్రముఖులు రూప్‌సింగ్, సవాయ్‌సింగ్, మన్మోహన్‌సింగ్, శంకర్ పాల్గొన్నారు.

◆ **కలుపు పనుల్లో మెలకువలు పాటించాలి**

కల్హేర్(నారాయణఖేడ్): వరి సాగు, కలుపు నివారణ పనుల్లో మెలకువలు పాటించాలని నారాయణఖేడ్ డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు నూతన్‌కుమార్ అన్నారు. సిర్గాపూర్ కడ్పల్‌లో వరి పంట పొలాలను పరిశీలించారు. ఆయన వెంట ఏఈఓ భార్గవ్‌చారి ఉన్నారు.

◆ **న్యాయవాదులకు హెల్త్‌కార్డులు అందజేయాలి**

సంగారెడ్డి టౌన్: న్యాయవాదులకు పర్మినెంట్ హెల్త్ కార్డులను అందజేయాలని బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సంగారెడ్డి లోని జిల్లా కోర్టులో న్యాయవాదులకు ప్రభుత్వం న్యాయవాదులకు జారీ చేసిన హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులకు పర్మినెంట్ హెల్త్ కార్డులతో పాటు బీమా ప్రీమియం 2,00,000 నుంచి 5,00,000 వరకు పెంచాలని డిమాండ్ చేశారు.

◆ **వరద కాలువల్లో పూడికతీత**

జహీరాబాద్: భారీ వర్షాలు కురిస్తే వరద నీటి ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందనే ఉద్దేశంతో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, శానిటరీ ఇన్స్పెక్టర్ సంధ్య ఆధ్వర్యంలో చైర్మన్ అధికారులు నెల రోజుల పాటు వరద కాలువల్లోని పూడికను తీయించే పనులు పూర్తి చేశారు. జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని ఇంద్రప్రస్త, డ్రీమ్ ఇండియా, హోతి(కె), ఆర్యనగర్, గడి మహెలా, విద్యుత్ ఎస్‌బీహెచ్ కాలనీ, మహిక్‌ప్రభు వీధి, చెన్నారెడ్డినగర్ కాలనీ ప్రాంతాల్లోని వరద కాలువల్లో పేరుకుపోయిన మట్టి, పూడికను తొలగించారు.

◆ **ఘనంగా నైపుణ్య దినోత్సవం**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): జిల్లా పరిషత్ పాఠశాలలో అమీన్‌పూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ నైపుణ్య దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ 03 రీజినల్ చైర్మన్ లయన్ కరణాకర్‌గౌడ్, ప్రధానోపాధ్యాయులు రాథోడ్, అమీన్‌పూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు కృష్ణగౌడ్, కార్యదర్శి నాగరాజు, కోశాధికారి సిద్దిరాములు, జోన్ చైర్మన్ వెంకటేశం, డిస్ట్రిక్ట్ చైర్మన్ రమణ, సభ్యులు తదితరులు లింగం పాల్గొన్నారు.

◆ **జీవో 10 రద్దు చేయాలని నిరసన**

జహీరాబాద్ టౌన్: జీవో నంబర్ 10ని రద్దు చేయాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ 65 సంవత్సరాలు నిండిన అంగన్‌వాడి కార్యకర్తలను అతి తక్కువ రిటైర్మెంట్ బెనిఫిట్ ఇస్తూ ఇంటికి పంపేందుకు ప్రభుత్వం జీవో నంబర్ 10ని తీసుకొచ్చిందన్నారు. ఈ జీవోతో అంగన్‌వాడీలకు అన్యాయం జరుగుతుందన్నారు. వెంటనే జీవోను రద్దు చేయలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ యూనియన్(సీఐటీయూ)నాయకులు నాగమణి, విజయలక్ష్మి, గౌరమ్మ, అమృత, జగదాంబ తదితరులు పాల్గొన్నారు.

◆ **విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌కు సన్మానం**

నారాయణఖేడ్: తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అన్వేష్‌రెడ్డి ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం పాటుపడాలని కోరారు. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వినోద్ పాటిల్ ఉన్నారు.